క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ జగదీష్‌బాబు

ఉదయగిరి: ఉదయగిరి తహసీల్దార్‌గా వి.జగదీష్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు సీఎఫ్ డీటీగా విధులు నిర్వహిస్తూ అడహక్ తహసీల్దార్‌గా ఇక్కడ నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి ప్రకాశం జిల్లా మార్కాపురం తహసీల్దార్‌గా బదిలీ వెళ్లారు.

బోర్లకు మోటార్లు ఏర్పాటు



కృష్ణారెడ్డిపాళెంలో జలకళ బోర్ నుంచి నీటిని వదులుతున్న రైతు, అధికారులు

కలిగిరి: మండలంలోని జలకళ పథకం ద్వారా రైతుల పొలాల్లో వేసిన బోర్లకు శుక్రవారం మోటార్లను ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం టీఏ చెంచయ్య మాట్లాడుతూ కలిగిరి, వీర్నకొల్లు, కృష్ణారెడ్డిపాళెం, అనంతపురం పంచాయతీల్లోని పలువురు లబ్ధిదారుల పొలాల్లో వేసిన జలకళ బోర్లకు మోటార్లు ఏర్పాటు చేసి నీటిని పారించినట్లు తెలిపారు. లబ్ధిదారులైన రైతులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతో ఉచితంగా బోర్లు వేయించడంతో మోటార్లు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. తమ కుటుంబాల్లో వెలుగులు నింపిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు.

భూసేకరణ చట్ట ప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

చేజర్ల(సోమశిల): జాతీయ రహదారి 67 నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసిత రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నెల్లూరు జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య అనంతసాగరం ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రదీప్‌ను శుక్రవారం కోరారు. భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం బహిరంగ మార్కెట్ విలువపై నాలుగు వంతులు కలిపి నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు సాదిక్ బాషా, ఎస్.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈఓ తనిఖీలు



చిలకపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న కావలి డిప్యూటీ డీఈఓ హరి ప్రసాద్

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని చిలకపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను కావలి డివిజన్ డిప్యూటీ డీఈఓ హరిప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాలకు ఆట స్థలం కోసం గతంలో గ్రామస్తులు చేసిన విజ్ఞప్తులపై నివేదికలు ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో మర్రిపాడు ఎంఈఓ ధనలక్ష్మి, చిలకపాడు సర్పంచ్ సిద్ధంరెడ్డి రమా, హెచ్‌ఎం శ్రీనివాసులు, ఎంఆర్‌పీ రాజేంద్రకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత ఆకస్మిక మృతి



నివాళులర్పిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌నాయుడు, అనిల్‌రెడ్డి

కావలి: మండలంలోని తిమ్మారెడ్డిపాళెంకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత పావన ఆదిశేషారెడ్డి ఆకస్మిక మరణించడంతో ఆయన మృతదేహానికి శుక్రవారం పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ అనీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బస్టాండ్ ప్రారంభం



బస్టాండ్ ప్రారంభోత్సవ వేదికపై ఆశీనులైన మంత్రులు, ఎంపీలు, మాజీ ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ తదితరులు

ఆత్మకూరు: పట్టణంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంజీఆర్ ఫౌండేషన్, ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా సుమారు రూ.4.50 కోట్ల వ్యయంతో అత్యాధునికంగా నిర్మించిన బస్టాండ్‌ను శుక్రవారం పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో అట్టహాసంగా ప్రారంభించారు. బస్టాండ్ సముదాయంలోనే దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పినిపె విశ్వరూప్, కళత్తూరు నారాయణస్వామి బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. విగ్రహావిష్కరణ సమయంలో పూల వాన కురిసింది. ప్రజలు, అభిమానుల కరతాళధ్వనుల మధ్య బస్టాండ్‌ను ప్రారంభించారు. ఏడీఎఫ్ వెబ్‌సైట్‌ను మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆవిష్కరించారు. ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించిన విద్య, వైద్యం, వ్యవసాయం, తదితర పూర్తి సమాచారం ఈ వెబ్‌సైట్ ద్వారా అందుబాటులోకి వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఏడీఎఫ్ ద్వారా ఆత్మకూరు నియోజకవర్గాన్ని ప్రణాళికాబద్ధంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అభివృద్ధి చేస్తారని పలువురు మంత్రులు అన్నారు. మంత్రులను మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. పలువురు పార్టీ అభిమానులు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో వైఎస్సార్, మేకపాటి కుటుంబీకుల చిత్రాలతో నిండిన బెలూన్‌ను ఎగురవేశారు. ఇది పలువురిని ఆకట్టుకుంది. బస్టాండ్ ఆవిష్కరణకు, బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి. వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్, ఆర్డీఓ సాధు కరుణకుమారి, కమిషనర్ బి.నాగేశ్వరరావు, పార్టీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, సయ్యద్ జమీర్, కలాం, రహీం, కొండా చిన్న వెంకటేశ్వర్లు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు



రిమోట్ ద్వారా దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం



బస్టాండ్ ప్రారంభ బహిరంగ సభలో పాల్గొన్న మేకపాటి కుటుంబ సభ్యులు, ప్రజలు

తెల్లగుంటలో తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం

- రూ.32 లక్షలతో తాగునీటి పథకానికి శంకుస్థాపన
- అదనంగా ఎమ్మెల్యే నిధుల నుంచి మరో రూ.3 లక్షలు
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



తెల్లగుంటలో జల్‌జీవన్ పథకం కింద పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంటలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా జలజీవన్ పథకం కింద రూ.32 లక్షలతో మంచినీటి పథకం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. తెల్లగుంటలో మంచినీటి పథకానికి ఎమ్మెల్యే శుక్రవారం భూమి పూజ నిర్వహించి లాంఛనంగా పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడే తెల్లగుంటలో శాశ్వత పరిష్కారంగా జలజీవన్ పథకం కింద మంచినీటి పథకం, పైపులైన్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జలజీవన్ నిధులతో పాటు ఎమ్మెల్యే నిధుల కింద మరో రూ.3 లక్షలు కూడా పైపులైన్ల ఏర్పాటుకు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పథకం పూర్తయితే స్థానికులకు తాగునీటి కష్టాలు తీరినట్లేనని తెలిపారు. ప్రతి ఇంటికి పైపులైన్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. అనంతరం ఉమామహేశ్వరపురంలో అంకమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అల్లిమడుగు, ఉమామహేశ్వరపురం సర్పంచ్‌లు కనిగంటి సుజన, ఇస్తారపు సావిత్రమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు, తూపిలి పెంచలయ్య, మేకల శ్రీనివాసులు, తుమ్మల రమణయ్య, స్థానిక నాయకులు కనిగంటి సునీల్, బొందు రమణయ్య, గడ్డం వెంకయ్య పాల్గొన్నారు.

చివరి ఎకరాకు కూడా సాగునీరు

కావలి కాలువ, ఎస్వీపీఎం కాలువల కింద ఆయకట్టు చివరి ఎకరా వరకూ కూడా సాగునీరు అందించేలా చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్వీపీఎం కాలువ కింద సాగునీరు సరిగా అందక ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఎమ్మెల్యే ఇరిగేషన్, సోమశిల అధికారులతో కలిసి శుక్రవారం స్వయంగా ఎస్వీపీఎం కాలువను పరిశీలించారు. రైతులు, అధికారులతో సాగునీటి సమస్యపై క్షుణ్ణంగా చర్చించారు. ప్రస్తుతం సంగం బ్యారేజీ నుంచి కావలి కాలువకు 450 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తుండగా, 550 క్యూసెక్కులకు పెంచాలని అధికారులకు సూచించారు. ఎస్వీపీఎం కాలువకు రోజుకు 130 క్యూసెక్కులకు తగ్గకుండా నీటిని విడుదల చేయాలన్నారు. ఎస్వీపీఎం కింద రైతులు వరితో పాటు పత్తి, వేరుశనగ, మిర్చిపంటలు సాగు చేశారని, చివరి ఎకరా వరకు సాగునీరు అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇరిగేషన్, సోమశిల అధికారులు కూడా సానుకూలంగా స్పందించి ఎస్వీపీఎంకు 130 క్యూసెక్కులు విడుదల చేసేందుకు అంగీకరించారు. ఎమ్మెల్యే వెంట దగదర్తి ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్‌నాయుడు, బోగోలు వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు ఉన్నారు.

గేదె యజమానికి పరిహారం

సాక్షి ఎఫెక్ట్..



వనం తిరుపాలుకు ఆర్థిక సాయం అందజేస్తున్న నారాయణ

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లిలో ఈ నెల 13న లోకేష్ యువగళం యాత్ర విడిది చేసిన ప్రాంతంలో మిగిలిపోయిన వ్యర్థాలను తిని అదే గ్రామానికి చెందిన వనం తిరుపాలు గేదె మృతి చెందింది. తిరుపాల్‌కు జరిగిన నష్టంపై పత్రికల్లో కథనాలు రావడంతో ఆ పార్టీ నేతలు స్పందించి స్థానిక నేతలకు ఆ పరిహార నగదును అందజేశారు. అయితే పరిహారాన్ని బాధితులకు ఇవ్వకుండానే స్థానిక నాయకుడు ఆ మొత్తాన్ని స్వాహా చేశారని ఆరోపణలు వచ్చాయి. దీంతో వనం తిరుపాలు తనకు జరిగిన అన్యాయంపై మర్రిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక నేతలు ఆ పరిహారాన్ని ఆరగించడంపై సాక్షిలో ఈ నెల 21న ప్రచురితమైన కథనానికి ఆ పార్టీ నేత శాఖమూరి నారాయణ స్పందించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మర్రిపాడు టీడీపీ నేత శాఖమూరి నారాయణ పడమటినాయుడుపల్లిలో తిరుపాలును కలిసి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు.

ప్రతిభచూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించిన సర్టిఫికెట్లు అందజేసిన హెచ్‌ఎం, తదితరులు



విద్యార్థులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందజేస్తున్న జితేంద్రనాథ్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పథకంలో భాగంగా హెచ్‌ఎం శేషాద్రివాసు శుక్రవారం నగదు, సర్టిఫికెట్లను అందజేశారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పదో తరగతిలో 550 మార్కులతో ప్రథమ స్థానంలో సీహెచ్ చరణ్‌కు రూ.3,000, 522 మార్కులతో రెండో స్థానం సాధించిన సంతోష్‌కు రూ.2,000, 512 మార్కులతో మూడో స్థానం సాధించిన పల్లవికి రూ.1,000 నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు ఆశలు నెరవేర్చేలా పాఠశాలలకు మంచి పేరు వచ్చేలా కష్టపడి చదవాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్ ఎం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుల్ల య్య, కె మధుసూదన్ శాస్త్రి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మల్లికార్జున, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ప్రోత్సాహకాలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టమూరు జితేంద్రనాగ్ రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షలను నెరవేర్చి విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అద్దబాల నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ ఆడుకోండి

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

ఆత్మకూరు: తాను స్వతహాగా ఫుట్‌బాల్ ప్లేయర్‌నని, వెంకటగిరిలో ఓ నాయకుడిని ఫుట్‌బాల్ ఆడుకుంటే సంతపేటలో పడతాడనుకుంటే ఆత్మకూరుకు వచ్చాడని, ఇక్కడి ప్రజలు ఫుట్‌బాల్ ఆడుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆత్మకూరులో శుక్రవారం ఎంజీఆర్ మున్సిపల్ బస్టాండ్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ఏడాదికో పార్టీ మార్చే ఆ నాయకుడిని ఆత్మకూరు ప్రజలు ఫుట్‌బాల్ ఆడుకుని సంతపేటకు శాశ్వతంగా తరిమేయాలన్నారు. త్యాగధనులైన మేకపాటి కుటుంబానికి అండగా ఉండాలని ఆత్మకూరు ప్రజలకు పిలుపునిచ్చారు.

ఇరిగేషన్ ఏఈ బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి:మండలంలోని గండిపాళెం జలాశయం ఏఈగా చంద్రమౌళి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న జేఈ విక్రమ్ సాధారణ బదిలీల్లో భాగంగా నెల్లూరు క్వాలిటీ కంట్రోల్ శాఖకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సోమశిల కావలి కెనాల్ ఏఈగా పని చేస్తున్న చంద్రమౌళి ఇక్కడ నియమించబడ్డారు.

రేపు ఉదయాద్రి బ్రాహ్మణ సేవాసంఘు సమావేశం

ఉదయగిరి: స్థానిక రంగనాయకులస్వామి ఆలయ ఆవరణలో ఉదయగిరి ప్రాంత ఉదయాద్రి బ్రాహ్మణ సేవా సంఘ సమావేశం ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఆ సంఘ అధ్యక్షుడు ఎస్‌వీఎస్ వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎంపిక, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై చర్చించడం జరుగుతుందన్నారు. సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఐ

బరువు తక్కువ చిన్నారులకు ఉచిత వైద్యపరీక్షలు



చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ మాశిలామణి

వరికుంటపాడు: వరికుంటపాడు అంగన్‌వాడీ కేంద్రంలో 0–5 ఏళ్లలోపు బరువు తక్కువ ఉన్న చిన్నారులకు శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విశ్రాంత డీఎంహెచ్‌ఓ, చిన్నపిల్లల వైద్యు నిపుణుడు డాక్టర్ కె.మాశిలామణి ఉచిత వైద్యసేవలందించారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులను గుర్తించి ఉచితంగా మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు చిన్నారుల ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తగా ఉండాలన్నారు. రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. 79 మంది చిన్నారులను పరీక్షించి వైద్యపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి కరిష్మా, సీహెచ్‌ఓ రాజశేఖర్‌రాజు, సీడీపీఓ లావణ్య, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పేదోడికి న్యాయం చేయడమే లక్ష్యం



లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పేద వాడికి న్యాయం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. దగదర్తి మండలం తురిమెర్లలో శుక్రవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఈ నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేసి, వారికి బుక్‌లెట్లను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందకుండా పోరాదన్న లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక కార్యక్రమానికి నాంది పలికిందన్నారు. అర్హత ఉన్నా కేవలం ధ్రువపత్రాలు లేవన్న కారణంతో లబ్ధి పొందలేని ప్రజలకు సాంత్వన అందిస్తూ ప్రజలకు కచ్చితంగా అవసరమయ్యే కీలక ధ్రువపత్రాలను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి ఇంట్లో ప్రభుత్వ సేవలకు సంబంధించి చిన్న సమస్యను కూడా ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాలన్న చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి 30 రోజుల పాటు అమలయ్యే 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గడపకు వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. తద్వారా లబ్ధిదారులకు పొరపాటున ఎక్కడైనా, ఎవరికైనా పథకాలు అందకుండా మిగిలిపోయి ఉంటే ఆ అర్హులకు కూడా మంచి చేయడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు, సేవలు అందించడం కోసం జల్లెడ పట్టి మరీ అర్హులను గుర్తించి పథకాలతో పాటు వారికి కావల్సిన కీలక ధ్రువపత్రాలను సేవా రుసుం లేకుండా అందజేస్తారని వివరించారు. గత టీడీపీ పాలనలో ప్రభుత్వానికి సంబంధించి ఏ పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ లంచాలు ఇచ్చుకునే పరిస్థితి ఉండేదని ఎమ్మెల్యే విమర్శించారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఈ పరిస్థితిని పూర్తిగా మార్చి వేసినట్లు తెలిపారు. పెన్షన్ కావాలన్నా.. రేషన్ కావాలన్నా నేరుగా ఇంటికే తీసుకు వచ్చే గొప్ప వలంటీర్ వ్యవస్థను తెచ్చి గ్రామ సుపరిపాలన సాగిస్తున్నామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే ఏపీలో పాలనాగతిని మార్చేసామని మ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ అనీల్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అచ్చమాంబ కల్యాణోత్సవం



అచ్చమాంబ పేరంటాలు కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఉభయకర్తలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం పొంగూరు మాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అచ్చమాంబ, వెంగమనాయుడు కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన కడియంపాటి వెంకటరమణ, అలివేలు దంపతులు, కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించి స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. అర్చకులు పాశర్లపూడి వెంకటేశ్వర్లుశర్మ, చింతలపల్లి మధుసూదనశర్మ ఆధ్వర్యంలో అమ్మవారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పాశర్లపూడి సుధామణిస్వామి ఆలపించిన పాటలు భక్తులను విశేషంగా అలరించాయి. అనంతరం ఆత్మకూరు రవీంద్రబాబు, అనురాధ దంపతులు, అనంతసాగరానికి చెందిన ఉమా కేటరింగ్ భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో గర్భిణులు కాన్పు చేయించుకోవాలి



గర్భిణికి సూచనలందిస్తున్న వైద్యుడు ఠాగూర్

ఉదయగిరి: మండలంలోని గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు చేయించుకుని ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సీహెచ్‌సీ గైనకాలజిస్ట్ డాక్టర్ ఠాగూర్ తెలిపారు. ఆయన శుక్రవారం వైద్యశాలలో కాన్పయిన వరికుంటపాడుకు చెందిన కె.పద్మకు బేబీ కిట్ అందించి తగు సూచనలందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో కాన్పు చేయించుకున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4 వేలు, కేంద్రం రూ.1,000 వంతున మొత్తం రూ.5 వేలు చెల్లిస్తుందన్నారు. మొదటి రెండు కాన్పుల్లో ఆడబిడ్డ జన్మిస్తే రూ.10 వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. వైద్యశాలలో ప్రతి సోమ, గురువారాల్లో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయన్నారు.

రైల్వే స్థలాల్లోని దుకాణాల తొలగింపు



బోగోలులో రైల్వే స్థలాల్లోని దుకాణాలు తొలగిస్తున్న దృశ్యం

బిట్రగుంట: బోగోలు, విశ్వనాథరావుపేట మేజర్ పంచాయతీల్లోని రైల్వే స్థలాల్లో చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న దుకాణాలను రైల్వే అధికారులు శుక్రవారం తొలగించారు. దుకాణాల ఏర్పాటు కారణంగా రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో స్థలాలు ఆక్రమణలకు గురికావడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో అధికారులు ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు. గతంలోనే పలుమార్లు నోటీసులు జారీ చేసిన అధికారులు ఈ నెల మొదటి వారంలో మరో మారు తుది నోటీసులు అందజేశారు. 22వ తేదీలోపు దుకాణాలు ఖాళీ చేయాలని లేని పక్షంలో 23న తొలగిస్తామని స్పష్టం చేయడంతో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు ఖాళీ చేశారు. దీంతో జేసీబీలతో తొలగింపు చేపట్టిన అధికారులు బోగోలు పంచాయతీలో 10, విశ్వనాథరావుపేట పంచాయతీలో 12 దుకాణాలు తొలగించారు. తొలగింపు ప్రక్రియ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా జీఆర్పీ పోలీసులు, బిట్రగుంట, దగదర్తి ఎస్సైలు బందోబస్తు నిర్వహించారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయండి



చేజర్ల: సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న అధికారులు

చేజర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్.కరిముల్లా కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్షపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం నెల రోజుల పాటు ఉంటుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం 15 సచివాలయాల పరిధిలో నెల రోజుల పాటు ఉంటుందన్నారు. 11 సేవలను ఉచితంగా పరిష్కరించనున్నారు. నెల రోజుల పాటు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు అందుబాటులో ఉండి ప్రజలకు కావాల్సిన సర్వీసులను పరిష్కరించాలన్నారు.

అనంతసాగరంలో

జగనన్న సురక్షకు సంబంధించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో అనంతసాగరం మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. నెల రోజుల పాటు 16 సచివాలయాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి వాళ్లకు కావాల్సిన సర్వీసులను నమోదు చేసుకొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రదీప్ పాల్గొన్నారు.

ఒకటి నుంచి జగనన్న సురక్ష

ఉదయగిరి: మండలంలో జూలై 1 నుంచి 27 వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం రెండు బృందాలను నియమించినట్లు తెలిపారు. 1న కృష్ణంపల్లి, శకునాలపల్లి, నేలటూరు, 6న వెంగళరావునగర్, 11న గుడినరవ, 13 బండగానిపల్లి, 15న ఉదయగిరి–1, 18న అప్పసముద్రం, 20న కొండాయపాళెం, 22న జి.చెరువుపల్లి, 25న ఉదయగిరి–2, 27న ఉదయగిరి–3 సచివాల యాల పరిధిలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని సచివాలయాల వారీగా జూలై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులను సచివాలయాలకు నోడల్ అధికారులుగా నియమించి ప్రజల సమస్యలు తక్షణం పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూలైలో ఆయా సచివాలయాలకు కేటాయించిన తేదీల్లో నోడల్ అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.